క్లుప్తంగా

సాంబశివరావుకు డాక్టరేట్



హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సాంబశివరావుకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. 'ఏ స్టడీ ఆన్ యాంకిల్ టాప్లెస్ డిటర్మెంట్ అండ్ బైలినియాన్ ట్రాన్స్‌ర్మేషన్' అంశంపై ఆయన పరిశోధనలు చేశారు. డాక్టర్ ఆర్.భార్గవిశర్మ పర్యవేక్షణలో పరిశోధనాత్మక వ్యాసాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావును ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రమాదేవికి..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగం పరిశోధకురాలు బి.రమాదేవికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. మల్టీపర్పస్ ఫీమేల్ హెల్త్ వర్కర్స్ ఇన్ హెల్త్ సెక్టార్– ఏ స్టడీ ఇన్ వరంగల్ అర్బన్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రమాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ఆచార్యులు కె.అయిలయ్య పర్యవేక్షణలో రమాదేవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్స్ పంపిణీ

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 1వ డివిజన్ ముచ్చర్లలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. చల్లా పూల్లమ్మ జ్ఞాపకార్థం పూలమ్మ కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో చల్లా మోహన్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు శ్రీధర్, రాజేష్, శ్రవణ్, సతీష్, సాంబశివారెడ్డి, కర్ణాకర్, రమేశ్,సంజీవ పాల్గొన్నారు.

రుణమాఫీపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



కాజీపేట: పట్టణ శివారులోని రైతులు మంగళవారం రైతు రుణమాఫీని హర్షిస్తూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా మాజీ కన్వీనర్ చల్లా వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు.

మండల పంచాయతీ అధికారిగా కర్ణాకర్‌రెడ్డి

హసన్‌పర్తి : మండల పంచాయతీ అధికారిగా కర్ణాకర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ధర్మసాగర్ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కర్ణాకర్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న రవిబాబును వేలేరుకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దుతాం



మామునూరు: పోచమ్మ ఆలయ ప్రాంగణాన్ని ఆహ్లాదం, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అందంగా తీర్చిదిద్దుతామని 21 కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, ఆలయ కమిటీ ప్రతినిధి నాగబడి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై సత్యసాయి నగర్ కాలనీలో పోచమ్మ దేవాలయంలో దాతల సహకారంతో అభివృద్ధి జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ రానున్న శ్రావణమాసంలోపు దాతలు ఇచ్చే ఆర్థిక సాయంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు విజేందర్‌రెడ్డి, రాజు, సదానందం, జంగా నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరుకవాడకు చెందిన గటికే కొమ్మాలు(48) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు కొమ్మాలు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మహమూద్, అవినాష్ తదితరులు ఉన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

● మామునూరు ఏసీపీ తిరుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

ఖిలా వరంగల్ : దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన యువత మత్తుకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారని, మాదకద్రవ్యాలు, గంజాయి, లాంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులై బంగారంలాంటి జీవితాలను నాశనం చేసుకోవద్దని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. మంగళవారం హంటర్ రోడ్డులోని తాళ్లపద్మావతి ఫార్మసీ, వాగ్దేవి బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాలలో మండల ఎక్సైజ్, మిల్స్‌కాలనీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రిన్సిపాళ్లు కమల్‌యాదవ్, వెంకటేశ్వర్లు అధ్యక్షతన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ, కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల నియంత్రణకు అందరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఇటీవల చదువుకునే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి నేరస్తులుగా మారుతున్నారన్నారు. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు కలిపి విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.మండల ఎక్సైజ్ శాఖ సీఐ కె.రాజు, తాళ్ల పద్మావతి డైరెక్టర్ వరుణ్, వాగ్దేవి హెచ్ఓడీ సురేందర్, మానసిక వ్యాధి డాక్టర్ భరత్, ఎక్సైజ్ శాఖ ఎస్సై కబీర్‌దాస్ పాల్గొన్నారు.

వివేకానంద కాలనీలో చోరీ



సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ వివేకానందకాలనీలో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన బండారి అనిల్ దంపతులు శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో షిర్డీకి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్న అనిల్ తాళం తీసి చూడగా బాత్‌రూం వెంటిలేటర్‌ను తొలగించి ఉండడం చూసి ఇంటిలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన పుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు పంజాబీ డ్రెస్ వేసుకుని ఇంట్లోకి వచ్చి కిరాణషాపులోని క్యాష్‌బాక్స్‌ను తీసినట్లుగా రికార్డు అయింది. సీసీ కెమెరాలను చూసి అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఈ చోరీలో సుమారు రూ.5వేల వరకు నగదు పోయినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి కాలనీకి చెందిన వారిగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లుగా సమాచారం. గత సంవత్సరం ఇదే ఇంటిలో దొంగతనం జరిగి రూ.54 వేలు పోయినట్లు బాధితుడు తెలిపాడు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



హన్మకొండ చౌరస్తా: జేసీబీతో డ్రెయినేజీ వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్ ఏఆర్ఆర్ నగర్ కాలనీలో మంగళవారం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక గ్యాంగ్‌వర్క్ పనులు చేపట్టారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున సిబ్బంది గడ్డి మందును పిచికారి చేశారు. రహదారులకు ఇరువైపులా పచ్చిగడ్డి, మొక్కలపై గడ్డి మందును పిచికారి చేశారు. కార్పొరేటర్ విజయశ్రీ, రజాలీతో పాటు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డలో గ్యాంగ్‌వర్క్

హన్మకొండ చౌరస్తా : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్‌లో మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది గ్యాంగ్ వర్క్ చేపట్టారు. పెద్దమ్మగడ్డ పాలెం ప్రభుత్వ పాఠశాల, అక్షర కాలనీ, జ్యోతిబసనగర్ కాలనీలో డ్రెయినేజీల్లో ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. సోమవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి డివిజన్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో కాంగ్రెస్ 4వ డివిజన్ అధ్యక్షుడు బాషబోయిన శ్రీధర్‌యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, మున్సిపల్ జవాన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేర కులస్తులను బీసీ 'ఏ' లో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరాజం

నయీంనగర్ : కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేర కులస్తులను బీసీ డీ నుంచి ఏ లో చేర్చాలని తెలంగాణ మేర సంఘాల ఐక్యవేదిక జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగ వెంకటరాజం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేర కులస్తులు బట్టలు కుట్టే పని వృత్తి మీదనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఏకరూపత బట్టలు కుట్టే టెండర్లు మేర కులస్తులకే ఇవ్వాలని, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మేర జేఏసీ నాయకులు మునిగాల రాము, మునిగాల రమేష్, సింగ్ విష్ణు, స్వామి, కీర్తి జయంత్, సంతోష్, రాకేష్, రవీందర్, నోముల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



బాలగంగాధర్‌తిలక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్: స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన బాలగంగాధర్ జయంతి వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని తిలక్‌రోడ్ కూడలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య ఉద్యమంలో యువత పాత్ర కోసం శివాజీ, గణేష్ ఉత్సవాలను ప్రారంభించి ఐక్యత సాధించిన స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర తిలక్ లోకమాన్య బిరుదు పొందారని అన్నారు. బీజేపీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిలక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కార్యదర్శి గడ్డల కుమార్, నాయకులు సిద్దోజు శ్రీనివాస్, సిరిమల్ల తిలక్, చింతం రాజు, కందుకూరి శ్రీనివాస్, అల్లి అజయ్, బొడ్డు రాకేష్, గాదె భిక్షపతి, సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటాచల మహత్యం



శ్రీవెంకటాచలం మహత్యాన్ని వివరిస్తున్న కృష్ణకుమార్

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు జరిగే శ్రీవేంకటాచల మహత్యం వైభవంగా ప్రారంభమైంది. శ్రీవేంకటేశ్వరస్వామి వెంకటాచలం మీద అన్ని యుగాల్లో భవిష్యపురాణం, బ్రహ్మాండ పురాణం, బ్రహ్మపురాణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి, చైర్మన్ పద్మ అరుణ, దేవేందర్ రెడ్డి, ఉపేందర్, కనపర్తి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటలో యువకులు



కాజీపేట : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు, కుంటల మత్తళ్ల పొంగిపొర్లుతున్నాయి. చెరువుల మత్తడి కింద మత్స్యకారులతో పాటు యువకులు చేపలు పడుతున్నారు. వరద నీటికి 15 కిలోలలోపు ఉన్న భారీచేపలు వలలకు చిక్కుతుండడంతో ఆనందంతో పలువురు వేటగాళ్లు తబ్బుబ్బిపోతున్నారు. వడ్డెపల్లి రిజర్వాయర్‌లో ఉన్న చేపలు మడికొండ పెద్ద చెరువు కాల్వ దాకా ఎదురెక్కుతుండడం విశేషం. కాలువల్లో ఎక్కువగా చేపలు లభిస్తుండటం విశేషం.

ఆరు బయటే స్నానం



కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు స్నానాలు పాఠశాల ఆరు బయటే చేస్తున్నారు. ఉదయం ఆరు బయట స్నానమంటే విద్యార్థులు వణుకుతున్నారు. పాఠశాల యాజమాన్యం సరైన సౌకర్యాలను కల్పించి ఆరు బయట స్నానాలు కాకుండా బాత్‌రూంలను ఏర్పాటు చేయాలని పిల్లల తల్లిదండ్రులు తెలుపుతున్నారు.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

బిహార్, ఆంధ్ర బడ్జెట్‌లా ఉంది

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బిహార్, ఆంధ్ర బడ్జెట్‌లా ఉంది. తెలంగాణ రాష్ట్రం నుంచి 8 మంది ఎంపిలను గెలిపించినందుకు బడ్జెట్‌లో నిధులేమైన కేటాయిస్తారని ఆశించిన ప్రజల నోట్లో మోదీ ప్రభుత్వం మట్టికొట్టిందన్నారు. తెలంగాణపై వివక్ష చూపి అన్యాయం చేశారు.

– జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ సంస్థ చైర్మన్

మధ్యతరగతికి అన్యాయం

బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు సంతృప్తినిచ్చేలా ఉంది. పేద, మధ్యతరగతి ప్ర జలకు అన్యాయం చేసే బడ్జెట్. ప్రజలపై పన్నుల భారం వేయడం దుర్మార్గం. తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీల నిధుల కేటాయింపు, ప్రస్తావన లేదు.

– బొట్ల చక్రపాణి, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి

ఉద్యోగులను నిరాశపర్చింది

ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశపర్చింది. ఈసారి కూడా ఆదాయ పన్నుల్లో మార్పులు చేస్తారని భావించారు. కానీ ఎలాంటి మార్పులు చేయలేదు. కొత్త పన్ను విధానం స్లాబులను మాత్రమే మార్చారు. ఎలాంటి మినాహాయింపులులేవు. ప్రస్తుతం మెజార్టీ ఉద్యోగులు పాతవిధానంలోనే పన్ను చెల్లిస్తున్నారు.

– పెండెం రాజు, టీఎస్‌యూటీఎఫ్ హనమకొండ జిల్లా జనరల్‌సెక్రటరీ

పేదలకు ఒరిగిందేమీ లేదు

బడ్జెట్‌తో పేదలకు, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ధరలు, నిరుద్యోగం ఇంకా పెరుగుతుంది. గ్రామాల్లో పనులు లేక పట్టణాలకు వలసలు వెళ్లడాన్ని నిరోధించే లక్ష్యంతో గ్రామాల్లోనే పనులు కల్పించే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకొస్తే దానిని నిర్వీర్యం చేశారు.

– టి.వెంకట్రాములు, బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు

అభివృద్ధే లక్ష్యంగా..

వికసిత్ భారత్ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరికీ ఉపాధి, అంత్యోదయ అభివృద్ధే లక్ష్యంగా మోదీ ప్రభుత్వ 3.0 మొదటి బడ్జెట్ ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్దపీట వేశారు. మహిళ, రైతు, నిరుద్యోగ యువతకు అండగా కేంద్ర బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకుంది.

–రావు పద్మ, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు

తెలంగాణ ఊసే లేదు

తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్నా తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌ల్లో అన్యాయం జరిగింది. తెలంగాణలో 8 ఎంపీలు గెలిపించినందుకు బడ్జెట్‌లోని ధులు కేటాయిస్తారని ఆశపడ్డ ప్రజల నోట్లో మట్టి కొట్టింది. బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బీజేపీ కుటిల నీతికి నిదర్శనం.

ఎర్రబెల్లి స్వర్ణ, – వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు

వీధికుక్కల దాడి



కాజీపేట అర్బన్ : కాజీపేట నుంచి ఉర్సుకు వెళ్లే ఖమ్మం బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయ ప్రాంతంలోని రహదారిపై వీధి కుక్కలు కాపు కాసి దాడి చేస్తున్నాయి. అటుగా ప్రయాణం అంటేనే నగరవాసులు జంకుతున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాశిబుగ్గ : ఢిల్లీలో ఆగస్టు 9న జరిగే మాదిగల మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం కాశిబుగ్గ జంక్షన్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ మాదిగలను మోసం చేసిందని, ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి అమలయ్యేలా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వక్కల కుమార్, కొమ్ముల భిక్షపతి, చింత జోసఫ్, ప్రేమ్‌కుమార్, ఉప్పలయ్య, యాకుబ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సంక్షేమమే బీఎంఎస్ లక్ష్యం

● టీఆర్‌పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్



బీఎంఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న శశికుమార్, నాయకులు, విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమేన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) లక్ష్యమని ఆ సంఘం అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కారదర్శి మన్నె శివకుమార్ అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ 70వ ఆవిర్భావ వేడుకలను జరుపుకున్నారు. ముందుగా బీఎంఎస్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం బీఎంఎస్ స్థాపించినట్లు తెలిపారు. శ్రామిక వర్గానికి బీఎంఎస్ అండగా నిలుస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో బీఎంఎస్‌కు అనుబంధంగా తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి, వారి హక్కుల రక్షణకు, నూతనంగా హక్కుల సాధనకు పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ హనుమకొండ జిల్లా కన్వీనర్ గాదె మహేందర్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు రావు రమణారెడ్డి, రాష్ట్ర నాయకుడు గంజి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్ నాయక్, వరంగల్ జిల్లా కార్యదర్శి కె.సంగీత్, నాయకులు శ్రీనివాస్, అనిల్ కుమార్, ఎం.వేణు, కె.యుగేందర్, జి.సంపత్ కుమార్, రమేష్, రామకృష్ణ, స్వప్న, కృష్ణవేణి, నవీన్, చరణ్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి

● జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాసస్వామి

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని జిల్లా సైన్స్‌అధికారి ఎస్.శ్రీనివాసస్వామి కోరారు. నేషనల్ గ్రీన్‌కార్ప్స్, ఏకోక్లబ్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం కాకతీయ యూనివర్సిటీ రోడ్డులోని వికాస్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీ, అలాగే కంపోస్టు గుంతల నిర్వహణపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసస్వామి మాట్లాడుతూ శక్తివనరుల సద్వినియోగం పొదుపులో భాగంగా విద్యుత్ వినియోగ ఖర్చును తగ్గించుకోవడానికి ఎల్ఈడీ టూబ్‌లైట్లు దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని 50 పాఠశాలల నుంచి 160 మంది విద్యార్థులు ఈ కార్యశాలలో పాల్గొన్నారు. నేషనల్ గ్రీన్‌కార్ప్స్ తెలంగాణ కోఆర్డినేటర్ బి.విద్యాసాగర్ విద్యార్థులకు టోపీలు ,పెన్‌లు , నోట్‌ప్యాడ్‌లు అందజేశారు. ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై కిరణ్, కంపోస్టు గుంతల నిర్వహణపై ఎస్.సాయితేజ ఎన్‌జీసీ తరుపున విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వికాస్‌హైస్కూల్ ప్రిన్సిపాల్ వాణి , నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యశాల అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట : పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో ఏ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచినా పేదలు ఇళ్లు, ఇళ్లస్థలాలు లేక పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టిస్తామని తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు ఇళ్లస్థలాలతో పాటు పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇళ్లస్థలాల విషయంలో ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, కరుణాకర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న జేడీఎం మల్లేశం, తదితరులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు మంగళవారం సాయంత్రం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ జేడీఎం మల్లేశం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి సర్వీసులో బదిలీ తప్పదన్నారు. ప్రతి ఉద్యోగి పనిచేసిన దగ్గర అందరితో మమేకమై విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో బదిలీ అయిన ఉద్యోగులు శివకుమార్, రమణ, వెంకన్న నాయక్, వంశీ, మైరున్‌బీ, పద్మలతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్–2 కార్యదర్శి రాము, రాజేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న తాటిపాముల తిలక్ అనారోగ్యానికి గురయ్యాడు. పేదరికంలో ఉన్న తిలక్ కుటుంబానికి కేయూ గణిత విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.నాగయ్య, తిలక్ మిత్రులు సతీష్, యాకూబ్‌పాషా కలిసి ఆ విభాగం సీనియర్ ఆచార్యులు రిజిస్ట్రార్ మల్లారెడ్డి సహకారంతో రూ.లక్ష తిలక్ ఇంటికి వెళ్లి అందజేశారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ చేతులమీదుగా తిలక్‌కు అందజేశారని మంగళవారం నాగయ్య తెలిపారు. నిరుపేదరికంలో ఉండి అనారోగ్యంతో బాధపడుతున్న తిలక్‌కు కనీసం రేషన్‌కార్డు కూడా లేదని మెరుగైన వైద్యం కోసం మీ సహకారం అందించాలని ఎమ్మెల్యేను కోరామని తెలిపారు. చేయూత అందించిన వారిలో యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ నాగయ్యతో పాటు అధ్యాపకులు సతీష్, రమేశ్, యకూబ్‌పాషా, నరేష్, భాస్కర్, యుగేందర్, ఆషీఫ్ తదితరులున్నారు.

నేడు భారత నాస్తిక సంఘం మహాసభ

హన్మకొండ: భారత నాస్తిక సంఘం తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ కమిటీ సభ్యుడు సాయిని నరేందర్ తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన ద్రవిడ కజగం నాయకుడు కుమరేసన్, విశాఖపట్నానికి చెందిన భారత నాస్తిక సంఘం జాతీయ నాయకులు రవి, శ్యామల, ప్రొఫెసర్ ఖాసీం , వి.సి.కె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, రచయిత గురిజాల రవీందర్, ప్రముఖ కవి, గాయకుడు సుక్క రాంనరసయ్య, హేతువాద సంఘం రాష్ట్ర నాయకురాలు రమాదేవి, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, విరసం నాయకుడు బాసిత్ పాల్గొంటున్నారన్నారు. సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన ఎల్లమ్మ తల్లి

కాజీపేట: పట్టణంలోని 62వ డివిజన్ సోమిడి శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లికి మంగళవారం భక్తులు కూరగాయలతో శాకంబరీ మాతగా ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. ఆషాఢమాసంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శంకర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమలు కలిపిన నది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. రంగురంగుల చీరెలతో అమ్మవారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు. మహిళలు ఎల్ల మ్మకు బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు.